క్లుప్తంగా

గృహాల సర్వే చేపట్టాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ధర్మరాజు

వంగర: గ్రామాల్లో గృహాలు సర్వే చేపట్టాలని తహసీల్దార్ దిరిశాల ధర్మరాజు తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న నవరత్నాల్లో భాగంగా మంజూరైన గృహాలను పరిశీలించాలన్నారు. నిర్మాణంలో ఉన్న ఇల్లు, ఖాళీ స్థలాలు గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీటీ హరి రమణారావు, ఆర్ఐ రామారావు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి

తెర్లాం: గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ సాగర్‌బాబు అన్నారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు మండలంలోని ఉద్దవోలు గ్రామంలో మంగళవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు పల్లెనిద్ర కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో సమావేశమై గ్రామానికి చెందిన విషయాలను వారితో చర్చించడం జరిగిందని తెలిపారు. గ్రామంలో ఎటువంటి అల్లర్లు, గొడవలకు పోకుండా ప్రజలంతా కలిసికట్టుగా ఉండాలని ఆయన సూచించారు. పల్లెనిద్రలో భాగంగా స్థానిక సాయిబాబా మందిరంలో రాత్రి నిద్ర చేశారు.

విలేకరిపై దాడి అమానుషం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

బాడంగి: పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ ప్రజాశక్తి విలేకరి ఎం.రామారావుపై టీడీపీ మండల అధ్యక్షుడు జి.వేణుగోపాలనాయుడు దాడి చేయడం అమానుషమని, దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని జర్నలిస్టులు కోరారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కె.సుధాకర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రజాస్వామ్య దేశంలో ఇటువంటి చర్యలు సరికాదన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాగరాజు, కృష్ణమూర్తి, రాజాసాహెబ్, రామకృష్ణ, సీతారాం తదితరులు ఉన్నారు.

మోదుగులపేటలో వైద్య శిబిరం

సంతకవిటి: మండలంలోని మోదుగులపేట గ్రామంలో శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్య సిబ్బంది బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు జి.బిందు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో దాదాపు 60 మందికి ఆరోగ్య తనిఖీలు చేశారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. 9 మందికి నేత్ర శస్త్ర చికిత్స అవసరం కాగా వారికి తమ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని వైద్యులు తెలిపారు. వైద్యులు కాసిబాబు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుస్తుల పంపిణీ



గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ

మెంటాడ: మండలంలోని గిరిజన గ్రామమైన ఉయ్యాడవలసలో గిరిజనులుకు ఆంధ్ర ఎస్ఐ కె.సీతారాం బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువతకు వాలీబాల్ కిట్లును అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులుతో మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండటంతో పాటు, ప్రతి ఒక్కరూ మంచి నడవడిక కలిగి ఉండి సేవాభావంతో మెలగాలని చెప్పారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గాయత్రీదేవి ఆలయంలో పూజలు



పూజలందుకున్న గాయత్రీదేవి

రాజాం: పట్టణంలోని చీపురుపల్లిరోడ్డులో గాయత్రీ కాలనీలో వెలసిన గాయత్రీదేవి ఆలయ 32వ వార్షికోత్సవ యాత్రా ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తొలిరోజు గాయత్రీదేవిని విశేష పూలదండలతో అలంకరించడంతో పాటు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు ఆలయ జాతర ఉంటుందని ఆలయ ధర్మకర్తలు కొండవేటి తేజోమూర్తి, వివేకానందరావు వెల్లడించారు. ప్రతీ రోజు గాయత్రీదేవికి కుంకుమ పూజలు నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు వాసా జగదీశ్వరరావు శర్మ తెలిపారు.

పల్లె సీమలకు వలస జీవులు

- వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తూ..
- మధ్యప్రదేశ్ వాసుల జీవన గమనం
- గ్రామాల్లో టార్పాలిన్లు అద్దెకిస్తూ జీవనం చేస్తున్న గుంటూరు వాసులు





విక్రయించేందుకు సిద్ధం చేస్తున్న పరికరాలు (ఇన్‌సెట్లో) అద్దెకు ఇచ్చేందుకు టార్పాలిన్‌లు

సంతకవిటి: ఉన్న ఊరిలో ఉపాధి కరువై పొట్టకూటి కోసం బండిని లాగేందుకు వందల కిలోమీటర్లు దాటి మధ్యప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాల నుంచి కుటుంబాలతో సహా రైతులు అధికంగా ఉండే గ్రామాలకు తరలివచ్చి ఇక్కడ జీవిస్తున్నారు. కష్ట పడే వారికి భాష, ప్రాంతంతో సంబంధం లేదని, చెమట చిందిస్తేనే నాలుగు వేళ్లు నోటిలోకి వెళ్తాయని శ్రమనే నమ్ముకుని వలస వచ్చి వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తూ ముందుకు సాగుతున్నారు. వ్యవసాయం, ఇంట్లో నిత్యం ఉపయోగపడే కత్తి, గొడ్డలి, గునపం, కత్తిపీటలు వంటి పనిముట్లు మధ్యప్రదేశ్ వాసులు తయారుచేస్తున్నారు. అక్కడ ఉన్న డిమాండ్‌ను బట్టి రెండు మూడు రోజులు గ్రామంలో ఉండి మరో గ్రామానికి వలస వెళ్తున్నారు. మధ్యప్రదేశ్ నుంచి వందల సంఖ్యలో ఇలా వస్తున్న కుటుంబాలు మళ్లీ హోలి పండగ సమయానికి తమ సొంత ఊళ్లకు వెళ్లనున్నారు.

పురుషులకు సాయంగా మహిళలు

వ్యవసాయ పనిముట్లు తయారీలో పురుషులతో పాటు మహిళలు కూడా చెమట చిందిస్తున్నారు. ఇనుమును కరిగించే సమయంలో మగవారితో సమానంగా సమ్మెట దెబ్బలు వేయడం, కొలిమిని మండించడం, తయారు చేసిన వస్తువులు విక్రయించడం వంటి పనులు చేస్తూ పురుషులకు సాయంగా మహిళలు నిలుస్తున్నారు.

టార్పాలిన్‌లు అద్దెకు ఇస్తూ..

అపరాలు పంట చేతికి వచ్చే సమయం కావడంతో గుంటూరు జిల్లా నరసరావు పేట నుంచి కొన్ని కుటుంబాలు మండలంలోని కొన్ని గ్రామాలకు వలస వచ్చి టార్పాలిన్‌లు అద్దెకు ఇస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అపరాలు సీజన్ కావడంతో టార్పాలిన్‌లకు మంచి గిరాకీ ఏర్పడింది. పంటను కళ్లాలకు తరలించకుండా రైతులు పొలాల్లోనే టార్పాలిన్‌లు వేసి అపరాల నూర్పు చేస్తుండడంతో రైతుకు శ్రమ తగ్గింది.

ఏటా వలస బాట



జీవనోపాధి కోసం ఏటా ఇలా వలస వస్తాం. ఒక్కో గ్రామంలో తిరుగుతూ పనిముట్లు తయారు చేసి విక్రయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాం. రైతులు మా పనిముట్లను ఆదరిస్తున్నారు.

– అజయ్, మధ్యప్రదేశ్

టార్పాలిన్‌లకు మంచి గిరాకీ



ఈ ప్రాంతంలో టార్పాలిన్‌లకు మంచి గిరాకీ ఉండడంతో ప్రతి ఏటా ఈ ప్రాంతాలకు వాటిని తీసుకువస్తాం. దాదాపు నెల రోజుల పాటు ఇక్కడే ఉండి అద్దెకు ఇచ్చి జీవనోపాధి కొనసాగిస్తున్నాం.

–యు.నాగేశ్వరరావు, నరసారావుపేట

చెరకు నరికేందుకు తుని, అన్నవరం ప్రాంతాల నుంచి..



చెరకు కొడుతున్న వలస కూలీలు

నాగావళి నదీ తీరంలో చెరకు పంట అధికంగా పండిస్తుండడంతో పాటు, రేగిడి మండలం సంకిలిలో ఉన్న ఈఐడీ ప్యారీ షుగర్స్ కర్మాగారం ద్వారా తుని, అన్నవరం తదితర ప్రాంతాల నుంచి కూలీలు గ్రామాలకు చేరుకుని చెరకు కొట్టి, ట్రాక్టర్‌లకు ఎక్కిస్తుంటారు. వీరికి టన్నులను బట్టి ఫ్యాక్టరీ వారు డబ్బులు చెల్లిస్తుంటారు. గ్రామాల్లో రైతులు వీరికి షెల్టర్ ఇవ్వడంతో పాటు వండుకునేందుకు పాత్రలు, పాలు తదితర వస్తువులు సమకూరుస్తారు.

ఇంటింటికీ సురక్షిత తాగునీరే లక్ష్యం



రామభద్రపురం: క్లాష్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, జేఈ

రామభద్రపురం: జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యమని ఎంపీడీఓ రత్నం అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పవన్‌కుమార్‌తో కలిసి బుధవారం ఆమె క్లాష్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఏర్పడితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

తెర్లాంలో..

తెర్లాం: వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా నిర్వహిస్తున్న క్లాష్ ప్రోగ్రాం తాగునీటి ఎద్దడిని నివారించేందుకు దోహదపడుతుందని ఎంపీడీఓ రేగి రాంబాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జెండా ఊపి క్లాష్ ప్రోగ్రాంను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో క్లాష్ ప్రోగ్రాం నిర్వహించి మరమ్మతులకు గురైన బోర్లను బాగు చేయాలన్నారు. ఈఓపీఆర్‌డీ నీలిమ, ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది, బోరు మెకానిక్‌లు బోడెల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఆట వస్తువులు

- ఐసీడీఎస్ పీడీ జె.కనకదుర్గ



పరికరాలు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ జె.కనకదుర్గ, డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

రామభద్రపురం: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తోందని, పిల్లలు ఆడుకునేందుకు అవసరమైన ఆట వస్తులను సరఫరా చేస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఐసీడీఎస్ పీడీ జె.కనకదుర్గ, డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేసేందుకు రామభద్రపురంలోని ఓ ప్రైవేటు ఏజెన్సీ గోదాంలో ఉన్న ఆట పరికరాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షం పథకం కింద జిల్లాలోని 2075 అంగన్‌వాడీ కేంద్రాల్లో మొదటి దశలో 113 కేంద్రాలకు క్రీడా పరికరాలు సరఫరా చేశామన్నారు. ఇప్పుడు రెండో దశలో 516 కేంద్రాలకు సరఫరా చేస్తున్నామని, తర్వాత మిగిలిన కేంద్రాలకు సరఫరా అవుతాయన్నారు. పిల్లలు కోసం ఆట వస్తువులతో పాటు టీవీ, ఆర్‌వో ప్లాంట్ తదితర పరికరాలను కేంద్ర ప్రభుత్వం సరఫరాచేస్తోందన్నారు. కొద్ది రోజుల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు పాలప్యాకెట్ల సరఫరాను నిలిపివేసి వాటి స్థానంలో పాలపౌడర్‌ను పంపిణీ చేసే అవకాశం ఉందన్నారు. ముందుగా పైలట్ ప్రాజెక్టు కింద సాలూరు, భద్రగిరి ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తామని చెప్పారు.

జీబీఎస్‌పై ఆందోళన వద్దు..

ప్రస్తుతం కలకలం రేపుతున్న జీబీఎస్ వ్యాధిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని డీఎంహెచ్‌ఓ భాస్కరరావు అన్నారు. జీబీఎస్ అంటువ్యాధి కాదని, నాడీ వ్యవస్థకు సోకే వ్యాధిగా పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యాధి నివారణకు సంబంధించిన మందులు ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయని, ఉచితంగా సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో సీడీపీఓలు పాల్గొన్నారు.

మామిడిలో ఫ్రూట్ కవర్ ఏర్పాటుతో నాణ్యత



మామిడి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఓ

రామభద్రపురం: మామిడిలో ఫ్రూట్ కవర్ ఏర్పాటు చేసుకుంటే కాయ నాణ్యత పెరిగి అధిక ధరలకు విక్రయించుకోవచ్చునని రామభద్రపురం, తెర్లాం మండలాల ఉద్యాన శాఖ అధికారి పి.మోహనకృష్ణ అన్నారు. మండలంలోని ఆరిక తోటలో ఆర్బీకేలో మామిడి యాజమాన్య పద్ధతులపై మామిడి రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి మామిడిలో ఫ్రూట్ కవర్స్ పథకం కింద 50 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఎకరానికి 8 వేలు కవర్లు అవసరమవుతాయని, 4 వేలు కవర్లకు 50 శాతం సబ్సిడీ కింద రూ.4 వేలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. కాయ జీడిమామిడి కాయ సైజులో ఉన్నప్పుడు కవర్ కట్టుకోవాలన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. మామిడిలో వచ్చే బూడిద తెగుళ్లు, తేనె మంచు పురుగు, తామర పురుగులు, పచ్చ పురుగులు వాటి నివారణపై సూచనలు చేశారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

వంగర: పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ తట్టికోట కన్నబాబు అన్నారు. మండల పరిధి వంగర, సంగాం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పంటల సాగుపై రైతులకు సూచనలు చేశారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించుకోవాలని వెల్లడించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం కావాలి



తెర్లాం: శిక్షణలో ప్రీస్కూల్ యాక్టివేషన్ నేర్చుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తెర్లాం: జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రీస్కూల్ నిర్వహణ, యాక్టివేషన్లు, పీపీ-1, పీపీ-2 విద్యా బోధనపై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆర్.రాంబాబు, ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీఓ రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు త్రినాధరావు, పాపారావు ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో రోజు శిక్షణను ఎంపీడీఓ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న ఓరియంటేషన్ కార్యక్రమం వారికి ప్రీస్కూల్ నిర్వహించేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఐసీడీఎస్ తెర్లాం, లోచర్ల సెక్టార్ల సూపర్‌వైజర్లు ఉషారాణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యను అందించాలి

వంగర: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని ఎంఈఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో బుధవారం మాట్లాడారు. కేంద్రాల ద్వారా చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, ప్రీ స్కూల్ నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఖండాపు జగదీశ్వరి, డీఆర్‌పీలు, విద్యాశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

రాజాం: అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం అందిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణను చక్కగా సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ యాగాటి దుర్గారావు సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులను పరిశీలించారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పొండ్రంకి నాగయ్య, రిసోర్సు పర్సన్‌లు వి.ఉషారాణి, కె.హరిప్రసాద్, వై.భాస్కర్‌లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆర్‌పి.ప్రసన్న, ఎమ్ఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



రామభద్రపురం: అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న డిప్యూటీ ఈఓ

పూర్వ ప్రాథమిక విద్యా బలోపేతానికి కృషి

రామభద్రపురం: పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ ఈఓ కె.మోహనరావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలోని పోషణ్ భీ, పడాయి భీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణ తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం అమల్లో భాగంగా చిన్నారులు తొలి అడుగులు వేసే అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందన్నారు. హెచ్‌ఎం కె.కామేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, రత్నకుమారి, సూర్యకుమారి పాల్గొన్నారు.

నేటి జగన్ పర్యటనను విజయవంతం చేయండి

- వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: పాలకొండకు చెందిన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పాలకొండ వస్తున్నారని ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాజాం ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ కోరారు. రాజాంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆయన బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు దివంగత పాలవలస రాజశేఖర్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని వెల్లడించారు. రాజాం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి పార్టీ అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. అనంతరం రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల పార్టీ శ్రేణులతో సమీక్షించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ, రూరల్, రేగిడి, వంగర మండలాల అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, కరణం సుదర్శనరావులు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు, కామోదుల శ్రీనివాసరావు, నక్క శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పాలవలస గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



వంగర మండలంలోని మరువాడలో ప్రకృతి వ్యవసాయ పంటల సాగుపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఇంటి ఆవరణలో కూరగాయల మొక్కలు పెంపకంపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు వినియోగించకుండా పెంపకం చేపడితే ఆరోగ్యకరమైన ఉత్పత్తులు వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం మరువాడ యూనిట్ ఇన్‌చార్జి ఆర్నిపల్లి సింహాద్రినాయుడు, మహిళలు పాల్గొన్నారు.

– వంగర

తలతంపరలో పల్లెనిద్ర



ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో సంతకవిటి మండలం తలతంపర గ్రామంలో మంగళవారం రాత్రి రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు పల్లె నిద్ర చేశారు. ముందుగా గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతా సమష్టిగా గ్రామాభివృద్ధికి పాటు పడాలన్నారు. ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. పల్లె నిద్రలో ఆయనతో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

– సంతకవిటి

సంక్షిప్తంగా...

బుల్లెమ్మ పేరంటాలు వార్షికోత్సవం

రేగిడి: మండలంలోని రేగిడి గ్రామంలో వెలసిన మామిడి కుటుంబీకుల ఇలవేల్పు బుల్లెమ్మ పేరంటాలు అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మామిడి కుటుంబీకులతో పాటు గ్రామస్తులు పాల్గొని వేడుకలు నిర్వహించారు.

కంపోస్ట్ ఫిట్‌లు నిర్మించుకోవాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏసీ

రేగిడి: మహిళా సంఘాల్లోని మహిళలు స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మహిళలు కంపోస్ట్ ఫిట్‌లు నిర్మించుకోవాలని వెలుగు ఏసీ చిరంజీవి సూచించారు. బుధవారం బాలకవివలస, పెద్ద శిర్లాం గ్రామాల్లో వీఓలు ఆధ్వర్యంలో సంఘాల మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం గోవిందరావు, సభ్యులు పాల్గొన్నారు.

క్రీడామైదానం అభివృద్ధి

రేగిడి: మండలంలోని సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని ఆటలకు వినియోగపడేలా అభివృద్ధి చేస్తున్నారు. సర్పంచ్ బి.పట్టాభి ఆధ్వర్యంలో, హెచ్‌ఎం రామినాయుడు పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి. బుధవారం ఈ మేరకు గ్రావెల్ తీసుకొచ్చి మైదానం చదును చేశారు.

ప్రతీ రైతు రిజిస్ట్రీ చేయించుకోవాలి

రేగిడి: భూమి ఉన్న ప్రతీ రైతు ఆర్‌బీకేల్లో తమ పేర్లు, వివరాలు రిజిస్ట్రీ చేయించుకోవాలని ఏఓ మురళీకృష్ణ రైతులకు సూచించారు. బుధవారం వెంకమపేట, చెలికానివలస, అక్కన్నఅగ్రహారం గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తమ ఆధార్ కార్డు, మొబైల్ నంబరు, 1బీ జిరాక్స్‌లు సబ్‌మిట్ చేయాలని వెల్లడించారు.

సదరం ధ్రువీకరణాల పరిశీలన

రాజాం: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద సదరం ధ్రువీకరణ పత్రాలు రీ వెరిఫికేషన్‌లో భాగంగా బుధవారం రేగిడి మండలంలో పలు గ్రామాలకు చెందిన దివ్యాంగులకు తనిఖీలు నిర్వహించారు. ఇప్పటికే ఈ తనిఖీలకు వస్తున్న దివ్యాంగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

రాజాం సిటీ: ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన ఉద్యమనేత కోరెడ్ల విజయగౌరి గెలుపునకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర మాజీ చైర్మన్ పి.బాబురెడ్డి అన్నారు. మండలంలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. విద్యారంగంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ ఎంతైనా ఉందన్నారు. వీటిని సాధించేందుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.వాసు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ జయంతి

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంలోని శాఖా గ్రంథాలయంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి కార్యక్రమాన్ని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివాజీ ఆశయ సాధనకు నేటి విద్యార్థులు కృషి చేయాలని కోరారు.

దాసాంజనేయ స్వామి ఆలయం పునఃప్రతిష్ఠ రేపు

బొబ్బిలి: స్థానిక పాత బస్టాండ్‌లోని శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పురాతన ఆంజనేయ స్వామి ఆలయం కనుక శతవర్ష ఉత్సవ కార్యక్రమాలుగా ఆలయ పునఃప్రతిష్ఠను వైభవంగా జరుపనున్నామన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్ది విద్యుద్దీపాలతో అలంకరించామన్నారు.

క్లాష్ ప్రోగ్రాం ప్రారంభం

బొబ్బిలి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి వనరులైన బోరుబావులను మరమ్మతులు చేసేందుకు క్లాష్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఎంపీడీఓ పోతుల రవికుమార్ బోరు మెటీరియల్ ఉన్న ఆటోను జెండా ఊపి ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఢిల్లేశ్వరరావు, ఏఈ ఎం.శ్రావణ్‌కుమార్, ఏఓ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.